కథానిక

# డబ్బురాజుగారి అభ్యర్థిత్వం

కొడవటిగంటి కుటుంబరావు

"హలో, హలో, హలో!" అన్నారు శ్రీవారు నన్ను చూస్తూనే. ఆయన బల్లముందున్న కాగితాలూ అవీ చూడగానే చాలా పని తొందరలో ఉన్నట్టు నే నర్థం చేసుకోగలిగాను.

"తమరిని కంగ్రాట్యులేట్ చెయ్యటానికి మాత్రమే వచ్చాను. పని చెడగొట్టటానికి కాదు," అన్నాను.

చాదస్తంగా మాట్లాడక కూచో, అన్నట్టుగా ఆయన తన పని మానకుండానే నాకొక ఆసనం చూపారు.

"ఇదంతా మీరు కట్టుకున్న పుణ్యమే", అన్నారాయన కాస్సేపటికి తల ఎత్తిచూసి.

"నేనా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. మీరు నవ్యవాణిలో రాసిన వ్యాసం చూశాకనే నాకు ఎన్నికలకు నిలబడాలన్న ఆలోచన కలిగింది."

అవును. నేనా వ్యాసంలో రాజులు ఎన్నికలకు నిలబడటంగురించి సపోర్టుచేస్తూ రాశాను. కాని—

"మరయితే తమరు కాంగ్రెసు టిక్కెట్టు పుచ్చుకున్నారు కాదేం? నేను నా వ్యాసంలో—"

చాలిస్తూ అన్నట్టు శ్రీవారు చెయ్యి ఆడించారు.

"నేను కాంగ్రెసు టిక్కెట్టుకోసం ప్రయత్నించకపోవటానికి చాలా కారణాలున్నాయి. ఒకటి, కాంగ్రెసు టిక్కెట్టు అదివరకే ఉలవయ్యకు ఇచ్చేశారు. ఉలవయ్య ప్రచారం ప్రారంభించాడు కూడాను. అసలా ప్రచారం ప్రారంభించటం మనకూ లాభించింది!" అన్నారు డబ్బు రాజుగారు.

"ఎట్లా?" అన్నాను.

ఏదో జ్ఞాపకం వచ్చి రాజావారు పెద్దపెట్టున నవ్వేశారు. ఆయన్ని చూసి నేనూ నవ్వాను. ఇద్దరం కొంచెంసేపు నవ్వాక అసలు విషయం బయటికొచ్చింది.

ఉలవయ్య, తనకు టిక్కెట్టు దొరకగానే రాజావారిదగ్గిరికి వచ్చి, తాను ఎన్నికలకు నిలబడుతున్నాననీ, పరమ పవిత్రమైన కాంగ్రెసు టిక్కెట్టు తనకు లభించిందనీ, అంచేత తనకు విజయం తప్పదనీ, ఈ తప్పనిసరి విజయం తన దయేటందుకు రాజావారు సర్వవిధాలా—ముఖ్యంగా డబ్బు రూపంలో—సహాయం పడే పక్షంలో తాను కాంగ్రెసు మంత్రిగా (ఎందుకు కాగూడదు? ఎవరు చూశారు?) రాజావారికి సర్వవిధాలా—వేరే వివరణ దేనికి? సహాయపడగల వాణ్ణని చెప్పాట్ట. ఉలవయ్య దేశభక్తుడూ, మోతుబరీ, రైతు కూలీలను గడగడలాడించి ఉన్నవాడూ, కమ్యూనిస్టులను వేటాడినవీరుడూ కనక అతనికి సహాయపడటానికి శ్రీవారు నిర్ణయించుకుని అతనికోసం ఒక లక్ష రూపాయలు ప్రత్యేకించడమే గాక దివాణం అధికార్లనూ, పరిపాలనా యంత్రాన్నీ అతని పరం చేసిపెట్టారట. ఈ నిర్ణయానికి రావటంలో శ్రీవారు ఇంకొక ఆలోచన కూడా చేశారు. అదేమిటంటే ఈ సీటుకు స్వతంత్ర అభ్యర్థిగా నిలబడే నూలకయ్యను కమ్యూనిస్టులు బలపరుస్తున్నామన్నారు. నూలకయ్య మొదటినుంచీ కాంగ్రెసు వ్యతిరేకి. ఒకప్పుడు రాజావారికి కుడిభుజంగా పని చేసినవాడు. కాని కొన్ని కారణాంతరాలవల్ల అతడు కమ్యూనిస్టులను చేరదీయసాగాడు. కమ్యూనిస్టుల వేట సాగిన సమయంలో నూలకయ్య వెంట అరడజను మనుష్యులుంచబడ్డారు. అతని ఇల్లు పదిహేనుసార్లు సోదా అయింది. కాని అతను దొరకలేదు. అతనిమీద ఎటువంటి నేరం మోపటానికి ఆవగింజంత ఆధారం దొరకలేదు. పైగా ఇప్పుడు ఈ సోదాలమూలంగా అతను కమ్యూనిస్టుల అభిమానం సంపాదించుకున్నాడు.

నూలకయ్యవంటి బలవంతుడు —1940లో

కూడా రాజావారికి అతను యెంత కావలిస్తే అంత ఖర్చుతూనే వచ్చాడు—ప్రతిపక్షం కావటము రాజావారికి యెంతమాత్రం ఇష్టంలేదు. కాని అతడు ప్రతిపక్షం అయినాడు గనుక అతన్ని ఓడించక తప్పదు. ఊలవయ్యను బలపరచటం రాజాగారికి తప్పని సరి.

అయితే - ఇక్కడే కథ పెడతిరగ సాగింది- ఊలవయ్యమీద జనం అనాదరణ ప్రదర్శించ సాగారు. రాజావారి కొత్తకేప్‌లో ఊలవయ్య అందరి దగ్గిరికీ వెళ్ళి తన అభ్యర్థిత్వం గురించి ఘనంగా చెప్పటానికి ప్రయత్నించాడు. డబ్బు కోసం అతణ్ణి బలపరచి ప్రచారం చెయ్య నిశ్చయించినవారు పోగా మిగిలినవాళ్లు నొస్లు నవుల సాగారు. కొందరు మిత్రులు కుండపగలేసి, "ఎందుకొచ్చిన హైరాన, నువ్వు గెలవవ్వు," అని కూడా ఊలవయ్యతో అన్నారు. ఎందుకైనా మంచిది, ఎన్నికలకు కాని కూడా ఖర్చుపెట్ట వద్దు, అని మరికొందరు సలహా ఇచ్చారు.

అయితే, రోగికి పథ్యం హితవు కానట్టుగా, అందుచేత ఊలవయ్య, తనను చూసి వాళ్ళంతా ఏడుస్తున్నారని, కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని అనుకున్నాడు. రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారం సాగించాడు.

మీటింగులు పెట్టాలి. ఊలవయ్యను కడిగెయ్యాలి. అప్పుగా తన మనసు వాగ్దానాలు చెప్పుకుంటే చాలదు. ఊలవయ్యను దహనం చేసెయ్యాలి. అప్పుడుగాని విరుగుళ్ళు తనను సాధించగలం చేసుకోడు.

ఊలవయ్య మీటింగు ఏర్పాటు చేశాడు.

ఈ మీటింగు గురించి చెప్పటానికి రాజావారికి హోట్లు పక్కైపోయింది. మీటింగు ఏర్పాట్లన్నీ దివానుగారే చేయించారు. కాని జనం మాత్రం రాలేదు, చివరకు దివానుగారూ, ఉద్యోగులునూ ఒక వందమందిని అద్దం పెట్టి ఊలవయ్య ఉపన్యాసం ప్రారంభించాడు. మామూలు ప్రజలు కొద్దిమంది వచ్చారు. వాళ్ళు కూడా ఊలవయ్యను వెటకారం చేశారు. "ఇంత పెద్ద మీటింగుకు లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేశావు కావేం. ఊలవయ్యా?" అని ఒకరూ, "ప్రతిపక్షాలు పోటీకైనట్లు లేదు, మీటింగు నాయుడా వెయ్యకూడదా?" అని మరొకరూ వేళాకోళం చేశారు. ఊలవయ్యకు లోపల మండిపోతోంది. మీటింగుకు జనం తండోపతండాలుగా వస్తారనుకున్నాడు. రాలేదు.

"ఇదే స్థలంలో నేను 1930లో ఉపన్యసించినప్పుడు అయిదు వేలమంది వచ్చారు. ఇసకవేస్తే రాల్లేదు. ఇవాళ కాంగ్రెసుమీద జనానికెంత అనాదరం ఏర్పడిందీ ఈ మీటింగును చూస్తే తెలుస్తుంది. పతనమయింది కాంగ్రెస్ కాదు ప్రజలు!" అని ఊలవయ్య రంకెలు పెడుతూండగానే, అతడు కోరిన అయిదు వేల మందీ ఉప్పెన వచ్చిపడ్డట్టు వచ్చారు. అయితే ఏ కారణంచేతో వాళ్ళతోబాటుగా అయిదు గాడిదలు కూడా వచ్చాయి. ఈ అయిదు గాడిదలూ మీటింగు ప్రవేశించాయనుకోండి. దాంతో సాగింది మైదానం గోల.

"లౌడ్ స్పీకర్లొచ్చాయ్రోయ్!" అన్నారు కొందరు.

గాడిదలకు అట్టలు కట్టారు. "ఊలవయ్యకే నా వోటు", అని ఒక గాడిదకూ, "నాకే మీ వోటు", అని మరొక గాడిదకూ, "నేను ప్రజా ప్రతినిధిని. నన్ను పాలించనివ్వండి" అని మరొక గాడిదకూ—ఈ విధంగా అట్టలు కట్టారు. జనంలో కలకల ధ్వనాలు చెలరేగాయి. గాడిదలు ఓండ్రపెట్ట సాగాయి. జనాన్ని తొక్కాయి.

"ప్రజా ప్రతినిధులకూ-జై", "లౌడ్ స్పీకర్లకూ-జై", "గాడిదలకూ-జై" అని నినాదాలు సాగించారు జనం. మీటింగు వదిలేసి ఊలవయ్య ఇంటికి వెళ్ళాడు. ఊలవయ్య వెళ్ళిపోయిన పదినిమిషాల్లోపుగా గాడిదలు కూడా మాయమైనాయి. ఆ మీటింగు కాస్తా నలకయ్యా మీటింగుగా మారిపోయింది.

"అంతటితో ఊలవయ్యమీద నాకు విశ్వాసం పోయింది. అతణ్ణి నమ్ముకున్నట్టయితే లాభంలేదని నిశ్చయించుకుని స్వతంత్ర అభ్యర్థిగా నేనే నిలబడవలసివచ్చాను", అన్నారు రాజావారు.

"ముగ్గురి మధ్య పోటీ కూడా?" అన్నాను.

"లేదు. ఊలవయ్య తన అభ్యర్థిత్వం విరమించుకున్నాడు."

"రాజులు అభ్యర్థులుగా నిలబడటం గురించి నెహ్రూ అన్న మాట విన్నారా?"

"నెహ్రూ చాలా మాటలన్నాడు. అందులో ఏమీ లేదు. నాకు పోటీగా అభ్యర్థిని నిలబెట్టబోమని స్థానిక కాంగ్రెసువారు లోపాయికారీగా మాట ఇచ్చారు. పోటీ మనకూ నులకయ్యకూ మధ్య ఉన్నది."

"మిమ్మల్ని గెలవకుండా చెయ్యటానికి కమ్యూనిస్టులు శాయశక్తులా ప్రయత్నిస్తారనుకుంటాను", అన్నాను.

"నులకయ్య గెలవకుండా చెయ్యటానికి మనం మటుకు ప్రయత్నించలేమా?"

"ఏమైనా ఆలోచించి పెట్టారా?"

"చాలా సలహాలు వచ్చాయి. వాటిని గురించే ఆలోచిస్తున్నాను. నులకయ్య బాలెట్ పెట్టెకు చిల్లిలేకుండా చెయ్యమని ఒకరి సలహా. నులకయ్యను రెండు రోజులు ముందుగానే ఎరెస్టుచేయించి, పోలింగురోజు ఉదయమే అతను చచ్చిపోయినట్టు ప్రచారం చెయ్యమని ఇంకొకరి సలహా. ఊళ్లో కలరా వచ్చిందని పుకారు పుట్టించమనీ, అట్లాచేస్తే వోటర్లు బయటికి రారనీ మరొక సలహా. ఈ పెద్దమనిషి చూడండి ఇంకో సలహా ఇస్తున్నాడు. "కమ్యూనిస్టులు క్యూలు నిలబెట్టుతున్నారు. ఆ క్యూల మీదికి లారీలనూ, కార్లనూ తోలి చెదరగొట్టండి. తరవాత మనమనుష్యులను క్యూలో నిలబెట్టవచ్చు. కావలిస్తే లారీ డ్రైవర్లను తాత్కాలికంగా ఎరెస్టు చెయ్యవచ్చు! సలహాలకేం చాలా వస్తున్నాయి. మనకు మనసే ఉండాలి గాని మార్గాలు లేకపోతాయా?"

"భేష్! బాగుంది! చాలా బాగుంది! ఇక నేను మీ విజయాన్ని ఆకాంక్షించటం తప్ప వేరే చేయదగిం దేమిటి గనకా!" అన్నాను.

నిన్ననే దిబ్బరాజ్యంలో పోలింగు జరిగింది. నాలుగు రోజులనుంచీ నులకయ్య జైల్లో ఉన్నాడు. మొన్నటినుంచీ అక్కడ కలరా ఉధృతంగా ఉన్నట్టు పత్రికల్లో చదివాను. పోలింగు సమయంలో లారీ ఒకటి కంట్రోలు తప్పి వోటర్ల క్యూ మీదికి పోయినట్టూ ఇద్దరు గాయపడ్డట్టూ తెలుస్తున్నది. కాని వోటర్లు నిరుత్సాహం చెందలేదు. నిశ్చలంగా నిలబడి వోటు చేశారు. నూటికి 95 వంతులు వోట్లు పోలయినట్టు అంచనా. దిబ్బరాజుగారికి డిపాజిట్ దక్కదని ఒక వదంతి. గిట్టనివాళ్ళు ఇటువంటి వదంతులు వేస్తారు. ఎన్నికల ఫలితాలు పత్రికలో పడినదాకా మనమేమీ అనకోరాదు.

కథానిక

# గర్వకారణం

ప్రేఖంరాజు కృష్ణమోహన్

మా ఊరి ప్రజలు సామాన్యులు కారు. మా గ్రామంలో ధనిక భూస్వాములున్నారు. మధ్యతరగతి రైతులున్నారు. పేద ప్రజలున్నారు. ఇద్దరు సంస్కృత పండితులున్నారు. స్కూలుఫైనలు కొద్ది మార్కులు తక్కువతో మూడుసార్లు తప్పిన ఘనులు ఇద్దరున్నారు. మా ఊరి ప్రజలు అన్ని రాజకీయపక్షాలకు చెందినవారు. విచిత్రమేమంటే జెండాలు మాత్రమే మావూళ్లో లేవు. కాబట్టే మా ఊరివాళ్ళు రాజకీయ మేధావులు. అందులో సందేహం లేదు. నిదర్శనం కావాలా మీకు? అయితే సావధానంగా వినండి. ఇప్పుడు మిమ్మల్ని, మమ్మల్ని, పీక్కుతింటున్న సమస్య ఒక్కటే. అది ఎలెక్షన్ల గొడవ. ఈ మధ్యనే మా గ్రామప్రజలు ఒక విచిత్రమైన నిర్ణయానికి వచ్చారు. అదేమిటంటే అన్ని పార్టీల నాయకుల్ని మావూరికి పిలవడం, ఉపన్యాసాలిప్పించడం, ప్రతి ఒక్కరి ఉపన్యాసం అవగానే ఆలోచించి వోటివ్వటం ఖాయమైతేనే చప్పట్లు కొట్టడం. మేం శ్రద్ధగా చప్పట్లు కొట్టాం.